# తేనెటీగల పెంపకంపై శిక్షణ

చుంచుపల్లి, నవంబర్ 2 : కృషి విజ్ఞాన కేంద్రం కొత్తగూడెం ఆధ్వర్యంలో శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకంపై మూడ్రోజుల శిక్షణను గురువారం ప్రారంభించారు. కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ లక్ష్మీనారాయణమ్మ మాట్లాడుతూ తేనెటీగల పెంపకాన్ని కుటీర పరిశ్రమగా చేపట్టడం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందవచ్చన్నారు. తేనెటీగల పెంపకం ద్వారా ఇతర పంటల్లో పరపరాగ సంపర్కం పెరిగి పంట దిగుబడులు గణనీయంగా పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన శాస్త్రవేత్త శివ, 40 మంది రిజిస్టర్ చేసుకున్న యువత, మహిళలు, రైతులు పాల్గొన్నారు.



శిక్షణ ఇస్తున్న శిక్షకుడు

# కొత్తగూడెం సీటు బీసీకి ఇవ్వాలి

## సీపీఐ కౌన్సిలర్ల డిమాండ్



సీపీఐ కొత్తగూడెం ఎమ్మెల్యే టికెట్‌ను షాబీర్ పాషాకు ఇవ్వాలని తీర్మాన పత్రాన్ని చూపిస్తున్న కౌన్సిలర్లు

భద్రాద్రి కొత్తగూడెం, (నమస్తే తెలంగాణ)/ కొత్తగూడెం అర్బన్, నవంబర్ 2 : కొత్తగూడెంలో సీపీఐ పార్టీకి చెందిన కౌన్సిలర్లు తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. ఏకంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుపై అసమ్మతి రాగం వినిపించారు. జిల్లాకేంద్రంలోని ఓ నాయకుడి ఇంట్లో గురువారం రహస్య సమావేశం నిర్వహించుకున్నారు. కొత్తగూడెం సీటును ఎట్టిపరిస్థితుల్లోనూ కూనంనేనికి ఇవ్వకూడదని, బీసీ సామాజిక వర్గానికి చెందిన ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషాకు ఇవ్వాలని తీర్మానం చేశారు. తమను కాదని కూనంనేనికి సీటు ఇస్తే మూకుమ్మడిగా పార్టీకి రాజీనామా చేస్తామని ప్రకటించారు. అసమ్మతి బృందంలో ఎనిమిది మంది కౌన్సిలర్లు, పలువురు సీపీఐ నాయకులు ఉన్నారు.



కంప్యూటర్లు అందజేస్తున్న వెంకటేశ్వరావు

# విద్యార్థులకు కంప్యూటర్ జ్ఞానం తప్పనిసరి

పాల్వంచ రూరల్, నవంబర్ 2 : ప్రపంచం డిజిటల్‌మయం అయినందున విద్యార్థులు తప్పనిసరిగా కంప్యూటర్ జ్ఞానాన్ని కలిగి ఉండాలని టీవీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ తాండ్ర వెంకటేశ్వరావు అన్నారు. మండలంలోని సోములగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం టీవీఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా పది కంప్యూటర్లను ప్రిన్సిపాల్ శంకర్‌కు అందించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చిన్న తరగతుల నుంచే విద్యార్థులు కంప్యూటర్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఇంటర్ విద్యార్థులు కంప్యూటర్ తప్పనిసరిగా నేర్చుకుని మరింత జ్ఞానాన్ని పొందాలన్నారు. కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటుకు ట్రస్ట్ ద్వారా సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు నరాటి ప్రసాద్, నవీన్, కళాశాల సిబ్బంది గోపాలకృష్ణ, రవీంద్రబాబు, సుధాకర్, అంజనాదేవి పాల్గొన్నారు.

# 'కార్మికుల ఐక్యతకు ప్రతీక టీఆర్‌వీకే'

పాల్వంచ రూరల్, నవంబర్ 2 : సమస్యల పరిష్కారానికి ముందుంటూ సంఘంలో కార్మికుల ఐక్యతకు ప్రతీకగా తెలంగాణ రాష్ట్ర విదుత్ కార్మిక సంఘం నిలుస్తున్నదని ఆ సంఘ నాయకులు తెలిపారు. సంఘ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో రీజనల్ అధ్యక్షుడు తోట కోటేశ్వరరావు మాట్లాడుతూ తమ సంఘ కార్మికులు ఇతర యూనియన్‌లో చేరారని కొందరు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. రామకృష్ణ అనే వ్యక్తి యూనియన్ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందున అతనిని యూనియన్ నుంచి తొలగించామని, మరోవ్యక్తి సొంత ప్రయోజనాల కోసం వేరే యూనియన్‌లో చేరాడని స్పష్టంచేశారు. సమావేశంలో యూనియన్ నాయకులు ముత్యాల రాంబాబు, రవికుమార్, రమేశ్ పాల్గొన్నారు.

# ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్‌కు శిక్షణ



మాట్లాడుతున్న మండల విద్యాశాఖాధికారి వెంకట్

జూలూరుపాడు, నవంబర్ 2 : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో జరిగిన స్టేట్ ఎడ్యుకేషనల్ ఎచ్యూవ్‌మెంట్ సర్వే పరీక్ష ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్‌కు మండల విద్యాశాఖాధికారి గురువారం శిక్షణ ఇచ్చారు. మండలంలోని 21 పాఠశాలలకు చెందిన ప్రైమరీ, జిల్లా పరిషత్, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 3, 6, 9వ తరగతికి చెందిన విద్యార్థులు ఈ పరీక్షల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ నెల 3వ తేదీన పరీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్‌కు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ పరీక్షలకు నోడల్ అధికారిగా సంజీవరావు, మండల రిసోర్స్‌పర్సన్‌గా వెంకటేశ్వర్లు వ్యవహరిస్తారని తెలిపారు.

# శిలాఫలకాల మూసివేత



శిలాఫలకాన్ని మూసివేయిస్తున్న అధికారులు

చుంచుపల్లి, నవంబర్ 2 : ఎన్నికల ప్రవర్తన నియమావళిలో భాగంగా ఎంసీసీ నోడల్ అధికారి సకినాల రమేశ్ చుంచుపల్లి మండలం, సుజాతనగర్ మండలంలో శిలాఫలకాలను మూసివేయించారు. మండల ఎంసీసీ కో ఆర్డినేటర్ మందా మంగమ్మ దగ్గరుండి మండలంలోని విద్యానగర్, రామాంజనేయకాలనీ, ఎన్‌కేనగర్, బాబూక్యాంప్ తదితర పంచాయతీల్లో గురువారం శంకుస్థాపన ప్రారంభోత్సవాల శిలాఫలకాలకు దగ్గరుండి పట్టాలు కప్పించారు. కార్యక్రమంలో ఎంపీవో గుంటి సత్యనారాయణ, కార్యదర్శులు బొంతు బాబూరావు, సిబ్బంది పాల్గొన్నారు.

# పాల్వంచ రచయితకు పురస్కారం

పాల్వంచ రూరల్, నవంబర్ 2 : పట్టణానికి చెందిన ప్రముఖ రచయిత అచ్యుతానంద బ్రహ్మచారికి విశాఖ పట్టణానికి చెందిన ప్రసన్న సాహిత్య విద్యా సాంస్కృతిక సేవా ట్రస్ట్ వారు కొండెపూడి సుబ్బారావు సాహితీ పురస్కారాన్ని గురువారం ప్రకటించారు. సంస్థ గత నెలలో నిర్వహించిన పద్యకావ్యం– పద్య సంపుటి పోటీల్లో తాను రాసిన సాందీపని చరిత్రకు పురస్కారం లభించినట్లు బ్రహ్మచారి తెలిపారు. బ్రహ్మచారికి సాహితీ పురస్కారం లభించడం పట్ల పలువురు సాహితీ ప్రియులు హర్షం వ్యక్తం చేశారు.

# టీబీజీకేఎస్ సమావేశాన్ని విజయవంతం చేయండి

రామవరం, నవంబర్ 2 : సింగరేణిలో గుర్తింపు కార్మికసంఘం టీబీజీకేఎస్ జనరల్ బాడీ సమావేశం ఈ నెల 4వ తేదీన రామవరంలోని ఏరియా కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎండీ రజాక్ తెలిపారు. ఈ మేరకు గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు గెలుపును కాంక్షిస్తూ గౌరవ అధ్యక్షురాలు కవితక్క, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకట్రావ్, రాజిరెడ్డి, మల్లయ్య వస్తున్నారని, కార్మికులు, నాయకులు అధికసంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. పిట్ సెక్రటరీలు శనిగరపు శంకర్, కుమార్, గౌస్, నాగరాజు, నటరాజ్, చిలక రాజయ్య, సత్తార్ బాష, కుమార్ స్వామి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సంతలో ఎల్‌ఈడీ లైట్ల ఏర్పాట్లు



సంతలో వెలుగుతున్న ఎల్‌ఈడీ లైట్లు

రామవరం, నవంబర్ 2 : కార్మిక ప్రాంతమైన రుద్రంపూర్ సెంటర్‌లో గురువారం ఏరియా వర్క్‌షాపు ఎస్‌ఈ టి.శ్రీకాంత్ ఆదేశాల మేరకు ఎల్‌ఈడీ లైట్లను ఏర్పాటు చేశారు. గత కొంతకాలంగా లైట్లు లేకపోవడంతో ఈ ప్రాంతం చీకటిమయంగా మారింది. ప్రతి గురువారం ఇక్కడ వారాంతపు సంతను నిర్వహిస్తుంటారు. సంతకు వచ్చే కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ప్రభావిత ప్రాంతాల ప్రజలు కూడా సంతలో తమకు కావాల్సిన వస్తువులు, కూరగాయలను కొనుగోలు చేస్తుంటారు. గురువారం ఎల్‌ఈడీ లైట్లను ఏర్పాటు చేయడంతో వ్యాపారులు, కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఏరియా జీఎం శాలెంరాజు, ఎస్‌ఈ శ్రీకాంత్, ఎలక్ట్రికల్ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

# ఓటర్లలో చైతన్యం రావాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో మందా మంగమ్మ

చుంచుపల్లి, నవంబర్ 2 : మండలంలోని బాబూక్యాంప్, ఎన్‌కేనగర్ పంచాయతీల్లో ఓటర్లను చైతన్యపర్చేందుకు గురువారం కళాజాత బృందాల ద్వారా అవగాహన కల్పించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీఆర్‌వో శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఎంపీవో గుంటి సత్యనారాయణ ఆధ్వర్యంలో కళాజాత ప్రదర్శనలు జరుగుతున్నాయి. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని, ఓటుహక్కును అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలో నూరుశాతం పోలింగ్ జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మందా మంగమ్మ, కళాకారుల బృందం సభ్యులు కొంపెల్లి బాలకృష్ణ, అలవాల కృపానందం, కేక్ మూసా, మిట్టపల్లి నరేందర్, ముత్తవరం ధనలక్ష్మి, గుగులోత్ నీల, షేక్ కౌసర్, కార్యదర్శి వెంకటేశ్వర్లు, భూమిక పాల్గొన్నారు.

# బాలికల అథ్లెటిక్స్‌లో విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పర్ణశాల, నవంబర్ 2 : ఉమ్మడి ఖమ్మంజిల్లా ఎస్‌జీఎఫ్ అండర్–17 బాలికల అథ్లెటిక్స్ పోటీలు ఈ నెల 1వ తేదీన ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగాయి. ఈ పోటీల్లో మండలంలోని గౌరారం ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థినులు కుంజి సమ్మక్క, మడకం జ్యోష్ణవి, బుద్దుల అనూష పతకాలు సాధించారు. హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు వారు ఎంపికయ్యారు. వారిని గురువారం హెచ్‌ఎం సుజాత, బి.నాగేశ్వరరావు, కే.నాగేశ్వరరావు, అనసూయ, మూర్తి, పాఠశాల సిబ్బంది వెంకటేశ్వరరావు, పీడీ వెంకటేశ్ అభినందించారు.

# మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

పాల్వంచ రూరల్, నవంబర్ 2 : కరెంటు షాక్‌తో మృతిచెందిన దంతెలబోర పంచాయతీ కార్మికుడికి ఎంపీవో బొగ్గ నారాయణ గురువారం ఆర్థికసాయాన్ని అందించారు. పంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్న కుంజా వెంకటేశ్వర్లు కరెంట్‌షాక్‌తో బుధవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీవో వెంకటేశ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. పంచాయతీ నిధుల నుంచి రూ.10 వేలు దహన సంస్కారం కోసం అందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, హనుమంతు పాల్గొన్నారు.

# ఐదుగురిపై కేసు నమోదు

పాల్వంచ రూరల్, నవంబర్ 2 : మండలంలోని దంతెలబోరలో కరెంట్‌షాక్‌తో బుధవారం కుంజా వెంకటేశ్ మృతిచెందిన ఘటనలో పాల్వంచరూరల్ పోలీసులు ఐదుగురిపై కేసు నమోదు చేశారు. దంతెలబోరకు చెందిన వెంకటేశ్ తన మిత్రులతో చేపలవేటకు వెళ్లి కరెంట్ షాక్‌తో మృతిచెందిన విషయం విదితమే. పోలీసులు గురువారం దంతెలబోర వెళ్లి విచారణ చేపట్టారు. ఈ ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన మృతుడి స్నేహితులు పాయం వెంకటేశ్, కాకా శేఖర్, కాకా రాము, వర్సా ప్రశాంత్, మోసం బాబుపై ఎస్సై కార్తీక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఘనంగా సమాధుల పండుగ

రామవరం, నవంబర్ 2 : కార్మిక ప్రాంతమైన రుద్రంపూర్, గౌతంపూర్, రామవరం ప్రాంతాల్లో క్రైస్తవ సోదరులు గురువారం తమ పితరుల సమాధుల వద్ద సమాధుల పండుగ నిర్వహించారు. ఆయా చర్చిలకు సంబంధించిన సమాధుల వద్ద క్రైస్తవ సోదరులు, పాస్టర్లు కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.